# తప్పిపోయిన సంబంధం

## 1

యెందుకని నా ప్రపోజిషన్ని మెచ్చి అంగీకరించవు? బాగా పరిచయస్థుడినే గదా? చెప్పి తీరాలి, ఊరికే నో అంటే సరిగాదు, నాకు సరిగా అర్థం గావాలి, యస్ అనే జవాబొస్తుందని ఆశించాను, చెప్పకపోతే నన్ను ఇన్‌సల్ట్ చేసినట్టే అన్నాడు జబర్దస్తీగా, వాడు సూటర్ అంతేగాక ఆఫీసర్.

అమ్మాయి నవ్వింది, కాలిగోరు చూసే కాపరం చేస్తుందో లేదో చెప్పవచ్చని ఒక సామెత ఉన్నది, కొత్త భక్తుడికి పూజలెక్కువని మరో సామెత యీ మధ్యే విన్నాను. అలాగా మీరు కూర్చున్న తీరూ, మీ కదలికలూ, మాట తీరూ చూస్తేనే మీ సైకాలజీ గ్రహించాను, రెండో సామెత ప్రకారం, మీకు ప్రపోజ్ చేయటం యిదే మొదటిసారేమో అనిపించింది, ప్రపోజిషన్ లోని క్లాజులన్నీ నాకే లాభసాటిగా ఉన్నాయి, అంత నిస్వార్థమైన ప్రేమ వుంటుందా యీ రోజుల్లో, అసలు చాలామంది మగవారు ప్రేమ లాక్కుంటారుగానీ యివ్వరు అని ఒక నెల క్రిందే ముంబాయినించి వచ్చిన నా ఫ్రెండ్ చెప్పింది, ఆమె వయసు ఫార్టీ, అనుభవం మీదే చెప్పి వుండాలి, నాకంటె మరో పదిహేనేళ్ళు ప్రపంచాన్ని యెక్కువగా పరిశీలన చేసింది నా ఫ్రెండ్, గ్రహించనిదీ అలా చెప్పలేదు.

కల్చర్ చూపిస్తూ, ఆశిస్తూ సాహసించి ప్రపోజ్ చేస్తే నిరాకరించిందే, తోసి పుచ్చిందే అని బాధపడ్డాడు సూటర్, తగనా అనుకున్నాడు ఆఫీసర్, దీని స్తోమతెంత స్టేటస్ యెంత వున్నది, దీనికి బురిడీ వేసి, లొంగదీసి మోసగిసేగాని యీ

బాధ పోదు అనుకున్నాడు, మొహమేమో నిర్మలంగానే వున్నది, నవ్వుతూనే చూస్తున్నాడు గానీ, కంఫ్యూషియస్ కళ్ళలోకి చూడు తెలిసిపోతుంది అన్నట్టు, అతని కళ్ళలోంచి అతని భావం తొంగి చూస్తున్నది.

మనసు మార్చుకుంటే ఫోన్ చేయచ్చు. లేదా నీవు మరొకరి మీద ఆశలు పెంచుకుంటే చెప్పేయచ్చు. నేనే మీ యిద్దరికీ పెళ్ళి జరిగేట్టు చూస్తా అన్నాడు కర్చీఫ్ తీసి మొహం అద్దుకున్నాడు.

అతని ఆలోచనలు చదివినట్టు అన్నది అమ్మాయి, చూశారా! అప్పుడే స్టైల్ మారింది, మీరు సమర్థులు, నేను అసమర్థురాలినని తెలియజెపుతున్నారు, నాకు నచ్చినవాడిని నేను పట్టలేనంటున్నారు, చపలచిత్త నంటున్నారు, మీ ఔదార్యం వెల్లడిస్తున్నారు, ముందు ముందు మీరు చేసే పొరపాట్లూ, తప్పులూ యెవరిసెత్తినైనా రుద్ది, "నేను నిర్దోషిని" అని నిరూపించగల సమర్థత వున్నది మీకు, వాదిస్తారు, అంతేగాని పొరపాటు జరిగింది అనరు, మరో పొరపాటు చేస్తారు, మళ్ళీ అదే పద్ధతి అంటున్నది తలెత్తి చూస్తున్నది.

పగిలిన అద్దంలో తన ప్రతిబింబం చూస్తున్నట్టు చూశాడా ఫీసరు.

థాంక్యూ, కనీసం ఇంటర్వ్యూ అన్నా జరిగింది, మీరు గుర్తుంటారు, గుడ్ బై, అని లేచాడు సూటర్.

— 0 —